అభివృద్ధి పరవళ్లు

- రూ.300 కోట్లతో పనులు
- కొత్త భవనాలతో పల్లెలకు అలంకరణ
- రూపురేఖలు మారిన కోడుమూరు నియోజకవర్గం

కోడుమూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన నాలుగేళ్లలో కోడుమూరు నియోజకవర్గం రూపురేఖలు మరిపోయాయి. సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి చేరుతున్నాయి. నాడు–నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలల కార్పొరేట్ విద్యావ్యవస్థలను తలదన్నేలా ఉన్నాయి. రహదారుల ఏర్పాటుతో పల్లె ప్రయాణం సులభమైంది. మొత్తానికి రూ.300 కోట్లతో నియోజకవర్గంలో చేపట్టిన పనుల వల్ల అభివృద్ధి పరవళ్లు తొక్కుతోంది.

కొత్తభవనాల ఏర్పాటుతో..

ప్రభుత్వం నిర్మిస్తున్న కొత్త భవనాతో కోడుమూరు నియోజకవర్గంలోని పల్లెలు మెరిసిపోతున్నాయి. అంగన్‌వాడీ, రైతు భరోసా, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ తదవతర భవనాల ఏర్పాటుతో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తున్నాయి. కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, కర్నూలు మండలాల పరిధిలోని పేదల కోసం 1,862 ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఇప్పటీవరకు రూ.22 కోట్లు మంజూరు చేసింది. 95 సచివాలయాల భవన నిర్మాణాలకు రూ.42 కోట్లు, 90 రైతు భరోసా కేంద్రాలకు రూ.19 కోట్లు, 64 హెల్త్ సెంటర్లకు రూ.12 కోట్లు ఖర్చు చేస్తోంది. నాడు–నేడు పథకం కింద దాదాపు రూ.90 కోట్ల ఖర్చు చేసింది.

గ్రామీణ రోడ్లకు మహర్దశ..

ఈ నాలుగేళ్లలో రవాణా సౌకర్యాలు మెరుగుపడ్డాయి. రూ.7కోట్ల గూడూరు నుంచి ఆర్.ఖానాపురం రోడ్డు, రూ.6 కోట్లతో గూడూరు– కొత్తకోట, రూ.10 కోట్లతో గూడూరు–పెద్దనాటూరు, రూ.56 లక్షలతో ముడుమలగుర్తి రోడ్డు పునర్నిర్మాణ పనులు పూర్తిచేశారు. రూ.10 కోట్లతో పెంచికలపాడు–గూడూరు, రూ.10 కోట్లతో మాసమసీద్–సుంకేశుల, రూ.5 కోట్లతో గొందిపర్ల, బి.తాంద్రపాడు, పసుపుల, సూదిరెడ్డిపల్లె గ్రామాలకు బీటీ రోడ్డు పనులను చేపట్టారు. రూ.15 కోట్లతో వెంకాయపల్లె నుంచి గార్గేయపురం వరకు బీటీ రోడ్డు నిర్మించారు. గూడూరు నుంచి చనుగొండ్ల మీదుగా కోడుమూరు వరకు రూ.10 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు నిధులు మంజూరయ్యాయి. కోడుమూరు నుంచి క్రిష్ణాపురం వరకు రూ.5 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు అధికారులు ప్రభుత్వానికి నివేదికను పంపారు. కర్నూలు, సి.బెళగల్ మండలాల్లోని గ్రామీణ రహదారుల మరమ్మత్తులు, కల్వర్టుల నిర్మాణం కోసం రూ.35 కోట్లు ఖర్చు చేసింది. వర్కూరు గ్రామం వద్ద బ్రిడ్జిపై రూ.2కోట్లతో కాజ్‌వేను నిర్మించారు.


పులకుర్తిలో నిర్మించిన సచివాలయ భవనం


ప్యాలకుర్తిలో నిర్మిస్తున్న జగనన్న ఇళ్లు


పులకుర్తిలో నాడు-నేడు పథకం కింద రూ.2 కోట్ల వ్యయంతో భారీ ఎత్తున నిర్మిస్తున్న తరగతి గదులు

నీటి సమస్యకు పరిష్కారం

గూడూరు నగర పంచాయతీలో తీవ్రమైన తాగునీటి సమస్య ఉండేది. వారానికోసారి కూడా ప్రజలకు తాగునీరు అందేదికాదు. జగనన్న ప్రభుత్వం రూ.54 కోట్లను విడుదల చేసింది. వీటితో గూడూరు పట్టణంలో నాలుగు ఓహెచ్ఆర్ ట్యాంకులు, రెండు సంపులను నిర్మించి పైప్‌లైన్‌ను ఏర్పాటు చేసి సంకేశుల ద్వారా నీటిని తరలించి తాగునీరు అందించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. కృష్ణగిరి, కోడుమూరు మండలాల పరిధిలోని 13 గ్రామాల ప్రజల సౌకర్యార్థం గోరంట్ల హంద్రీ నదిపై బ్రిడ్జిని ఏర్పాటు చేసేందుకు రూ.24 కోట్లు మంజూరు చేసింది. అలాగే కోడుమూరు పట్టణంతో పాటు వెంకటగిరి, ప్యాలకుర్తి, రామచంద్రాపురం, వర్కూర్, చనుగొండ్ల గ్రామాలకు తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రూ.30 కోట్లు మంజూరు చేసింది.

సొంతింటి కల నెరవేరుతోంది



జగనన్న కాలనీలో నాకు ఇల్లు మంజూరైంది. ప్రభుత్వం మంజూరు చేసిన బిల్లు సరిపాక పోవడంతో ఇంటి నిర్మాణానికి ఇబ్బందయింది. వెలుగు సిబ్బంది బ్యాంకు అధికారులతో మాట్లాడి మరో రూ.35 వేలు పావుల వడ్డీకి రుణం ఇప్పించారు. త్వరలో సొంతింటి కల నెరవేరుతోంది.

– పర్వీన్, సి.బెళగల్

ముఖ్యమంత్రి రుణపడి ఉంటాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన చేయూత పథకం ద్వారా నాకు రూ.18,750 చొప్పున మూడు సార్లు ఖాతాలో పడింది. మాలాంటి పేదలకు సాయం చేసిన ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాం. మాలాంటి పేదల కోసం ఎన్నో పథకాలు తీసుకవచ్చి మమ్మలను ఆదుకుంటున్నాడు. ఆయన ఇచ్చే పథకాల డబ్బుతో అప్పులు తీర్చుకుని కుటుంబాలకు తోడుగా ఆడవాళ్ల అయినా మేము ఉంటున్నాము.

– దీవెనమ్మ, ఇనగండ్ల గ్రామం

పల్లెల రూపురేఖలు మరాయి



ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన నాలుగేళ్లలో కోడుమూరు నియోజకవర్గంలో రూ.300 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయి. ప్రతిపక్ష పార్టీల నేతలు సిగ్గుపడేలా అభివృద్ధి పనులు జరిగాయి. సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ కేంద్రాల నిర్మాణాలతో పల్లెల ముంగిటకే సేవలు వచ్చి చేరాయి. ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలు దాదాపుగా పూర్తయ్యాయి. త్వరలో గూడూరు– కోడుమూరు, క్రిష్ణాపురం రోడ్డు నిర్మాణ పనులను చేపడుతున్నాం.

– సుధాకర్, కోడుమూరు ఎమ్మెల్యే

మూడు గ్రామాల కల.. నెరవేరిన వేళ

పాణ్యం మండలంలోని ఎస్.కొత్తూరు, అనుపూరు, అహల్యాపురం, గగ్గటూరు గ్రామాల ప్రజలు ఏ ప్రభుత్వ సేవలు పొందాలన్నా 15 కిలోమీటర్లు ప్రయాణించి మండల కేంద్రానికి చేరుకోవాల్సి ఉందేది. ప్రస్తుతం కొత్తూరులో రూ.45 లక్షలతో గ్రామ సచివాలయాన్ని నిర్మించడంతో ఈ నాలుగు గ్రామాల ప్రజల కష్టాలు తొలగిపోయాయి. ఏ చిన్న పని ఉన్నా సచివాలయంలోనే పరిష్కారమవుతుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ఇంటి పట్టా మంజూరైంది



మా కుటుంబం పదేళ్ల నుంచి అద్దె ఇంటిలో నివాసముంటున్నాం. గతంలో ఇంటి స్థలం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగినా ఇవ్వలేదు. ఈ ప్రభుత్వంలో వలంటీర్ మా వద్దకే వచ్చి వివరాలు తీసుకెళ్లాడు. వెంటనే పట్టా మంజూరైంది. చాలా సంతోషంగా ఉన్నాం.

– కొమ్ము రమాదేవి గడివేముల

సంక్షేమం కొత్త పుంతలు

- ఏళ్ల నాటి సమస్యలకు శాశ్వత పరిష్కారం
- ప్రజల వద్దకే సంక్షేమ పాలన
- ప్రాజెక్టులు, పరిశ్రమలు ఏర్పాటు

పాణ్యం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లే అయ్యింది. అతితక్కువ కాలంలోనే నియోజకవర్గంలో అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతోంది. సచివాలయాలు, ఆర్‌బీకేలు, హెల్త్ సెంటర్ల ఏర్పాటుతో పల్లెల ముంగిట్లో ప్రభుత్వ సేవలు వచ్చి చేరాయి. నాడు–నేడు పనులతో ప్రభుత్వ పాఠశాలలు మెరుగుపడ్డాయి. ప్రాజెక్టులు, పరిశ్రమల ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు పెరిగాయి. రహదారుల ఏర్పాటుతో రవాణా కష్టాలు తొలగిపోయాయి. ప్రతి మండలానికి 108, 104, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, పిల్లల ఆరోగ్యం కోసం బాల సురక్ష, తదితర పథకాలతో పేదల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇచ్చారు.

రవాణా సౌకర్యం మెరుగు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రహదారులు చాలా మెరుగుపడ్డాయి. రూ.2 కోట్లతో మద్దూరు–కొత్తూరు రోడ్డు, రూ.1.80 కోట్లతో కొణిదేడు–కొత్తూరు, రూ.70 లక్షలతో తొగర్చేడు–ఉడుమాల్పురం, రూ.2.35కోట్లతో పాణ్యం–బనగానపల్లె, రూ.2.60కోట్లతో గోనవరం–బలపనూరు రహదారులు పూర్తి చేశారు. అలాగే రూ.85 లక్షలతో పిన్నాపురం బ్రిడ్జి, రూ.85 లక్షలతో మద్దూరు–కొత్తూరు గ్రామాల మధ్య ఉన్న వాగుపై కల్వర్టు పూర్తి చేశారు. ఇక నాడు నేడు కార్యక్రమంలో భాగంగా రూ.17 కోట్లతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. రూ.2 కోట్లతో కొత్తూరు ఆలయ అభివృద్ధి పనులు చేపట్టారు.


రూ.625 కోట్లతో పూర్తి చేసిన గాలేరు లైనింగ్ పనులు

ప్రాజెక్టులకు ప్రాణం

గోరుకల్లు ఇన్‌ఫ్రా రెగ్యులేటర్‌కు ప్రస్తుతం ఉన్న ఐదు గేట్లకు మరో రెండు గేట్లు ఏర్పాటు చేసేందుకు రూ.30 కోట్లతో పనులు చేపట్టారు. రూ.20 కోట్లతో గాలేరుకు గెట్లు ఏర్పాటు చేసి స్టోరేజీ పెంచేందుకు చర్యలు తీసుకున్నారు. అలాగే రూ.625 కోట్లతో లైనింగ్ పనులు పూర్తి చేశారు. మరో రూ.630 కోట్లతో అవుకు టన్నెల్ మూడో సొరంగం పనులు శరవేగంగా జరుతున్నాయి. వీటికి తోడు పరిశ్రమల హబ్‌గా ఉన్న ఓర్వకల్లు తాగు, సాగు, నీటి కోసం మల్లికార్జున జలాశయం నిర్మించేందుకు ఇటీవల సీఎం రూ.1,500 కోట్లు మంజూరు చేశారు.

- కల్లూరు మండలంలో రూ.9.57 కోట్లతో పీఆర్ ద్వారా అభివృద్ధి పనులు చేశారు. రూ.5.30 కోట్లతో గ్రావెల్ రోడ్లు నిర్మించారు. ఈ నాగులు ఏళ్లలో మండలానికి రూ.7.45 కోట్లతో నీటి వసతి కల్పించారు. జగనన్న లేఅవుట్లలో రూ.5.12 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించారు. రూ.3.57లక్షలతో నాడు–నేడు ద్వారా 53 పాఠశాలల రూపరేఖలు మార్చారు.


పాణ్యంలో రూ.40 లక్షలతో నిర్మించిన అగ్రి ల్యాబ్

- ఓర్వకల్లు మండలంలో రూ.7 కోట్లతో ప్రభుత్వ భవనాలు నిర్మించారు. రూ.15 కోట్లతో నీటి వసతి కల్పించారు. రూ.2 కోట్లకు పైగా ఖర్చు చేసి రోడ్లు వేశారు. ఆర్‌బీకే, హెల్త్ సెంటర్, ఇతర ప్రభుత్వ సముదాయల భవనాలకు రూ.43.26 కోట్లు వెచ్చించారు. సంక్షేమ పథకాలకు రూ.150 కోట్లు ఖర్చు చేశారు. కేతవరం పర్యటక ప్రదేశంగా తీర్చిదిద్దారు. రూ.750 కోట్లతో జయరాజ్ ఇస్పాత్ పరిశ్రమ ఏర్పాటు చేశారు. ముచ్చుమర్రి నుంచి రూ.350 కోట్లతో నీటి పంపింగ్ కోసం నిధులు కేటాయించారు. గుమితం తండాలో రూ.15000 కోట్లతో బహుళ విద్యుత్ ఉత్పాదక ప్రాజెక్టుకు సీఎం శంకుస్థాపన చేశారు. రూ.50 కోట్లతో ఉర్దూ యూనివర్సిటీని నిర్మిస్తున్నారు.
- గడివేముల మండలంలో రూ.10 కోట్లతో నాడు–నేడు పనులు పూర్తి చేశారు. రూ.415 కోట్లతో సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్లు, ప్రభుత్వ భవనాలు నిర్మించారు. రూ.2.50 కోట్లతో రోడ్లు వేశారు. మంచాలకట్ట గ్రామంలో రూ.50 లక్షలతో ఎత్తిపోతల పథకం కింద చెరువు నింపుతున్నారు.

క్లుప్తంగా

రెమిడియల్ తరగతుల తనిఖీ


రెడియిడల్ తరగతుల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న పీఓ రవింద్రారెడ్డి

పాణ్యం: గిరిజన గురుకులాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఐటీడీఏ పీఓ రవింద్రారెడ్డి అన్నారు. సోమవారం నెరవాడ మెట్టువద్ద ఉన్న గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో నిర్వహిస్తున్న రెమిడియల్ తరగతులను, ఆశ్రమ తదితర పాఠశాలను తనిఖీ చేసి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అందరూ పాస్ అయ్యేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఏఎంఓ రామాంజనేయులు, ప్రిన్సిపాల్ మేరి సలోమి ఉన్నారు.

కాల్వలో నేడు ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలు

ఓర్వకల్లు : మండలంలోని కాల్వ గ్రామంలో వెలసిన శ్రీబుగ్గరామేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్ సోమవారం తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉదయం గణపతి పూజ, పుణ్యహావాచనము, ఋత్విక్‌కరణము, మంటపారాధన, తీర్థ ప్రసాద వితరణ వుంటుందన్నారు. సాయంత్రం బలిహోమము, జలాధివాసము, మహా మంగళ హారతి పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

స్పందన సమస్యలను పరిష్కరించాలి

గూడూరు రూరల్: గ్రామ సచివాలయాల్లో చేపట్టిన స్పందనకు వచ్చే అర్జీలు, వినతులకు పరిష్కారం చూపాలని ఎంపీడీఓ మాధవీలత సూచించారు. కె.నాగలాపురంలోని సచివాలయాన్ని సోమవారం ఆమె తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యలపై సచివాలయాల్లో ప్రజలు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

విద్యాకానుక ప్రతి విద్యార్థికి అందాలి

గడివేముల: ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి జగనన్న విద్యాకానుక అందించాలని ఎంఈఓ రామకృష్ణుడు ఆదేశించారు. మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్, ఎంఈఓ కార్యాలయంలో ఉన్న విద్యాకానుకల స్టాకును సోమవారం పరిశీలించారు. అనంతరం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో హెచ్‌ఎంలతో ఎంఈఓతో పాటు పంచాయతీరాజ్ ఏఈ భాస్కర్, ఏపీఎం హజరత్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వచ్చే విద్యాసంవత్సరంలో చేరే విద్యార్థులకు జగనన్న విద్యాకానుకలు అవసరమైన వివరాలను ఆన్‌లైన్ నమోదు చేయాలన్నారు. ఆయా పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనుల పురోగతిని తెలుసుకుని వచ్చే నెల 12వ తేదీ లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కో ఆర్డినేటర్ హిదాయతుల్లా, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం జగనన్న

- వైఎస్సార్‌సీపీ పాలనలోనే కోడుమూరు నియోజకవర్గ అభివృద్ధి
- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్ : పేదలకు, పెత్తం దారులకు జరుగుతున్న యుద్ధంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి పేదలకు అండగా నిలిచారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. అమరావతిలో 50వేల మంది లబ్ధిదారులకు ఇళ్లు కట్టించి ఇవ్వాలన్న సీఎం జగనన్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ, జగనన్న పాలన చేపట్టి నాలుగేళ్లు పూర్తవుతుండడాన్ని హర్షిస్తూ సోమవారం వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి నియోజకవర్గంలోని కర్నూలు, గూడూరు, కోడుమూరు మండలాల్లో భారీ బైకు ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో గత 70ఏళ్ల పాలనలో ఏ ప్రభుత్వం కూడా అందించని విధంగా కులమత తారతమ్యం లేకుండా పార్టీలకతీతంతగా సంక్షేమ పథకాలందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. 40ఏళ్లకు పైగా కోడుమూరు నియోజకవర్గాన్ని పరిపాలించిన బడానేతలు చేయలేని అభివృద్ధి ఈ నాలుగేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో జరిగిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికై ప్రభుత్వం సుమారు రూ.200 కోట్లకు పైగా ఖర్చుపెట్టిందని చెప్పారు. పేదలకు అండగా నిలుస్తున్న జగనన్నకు ప్రజలంతా అండగా నిలవాలని కోరారు.


గూడూరులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్, పార్టీ శ్రేణులు

అడుగడుగునా నీరాజనాలు

కర్నూలు నుంచి గూడూరు మీదుగా కోడుమూరులోని వైఎస్సార్ విగ్రహం వరకు 70 కిలోమీటర్లు భారీగా బైక్ ర్యాలీ చేపట్టిన ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌కు ఆయా గ్రామాల్లో ప్రజలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పూలవర్షం కురిపిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు ప్రసన్నకుమార్, మౌలాలి, గిరిజోన్, గూడూరు మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్ అస్లాం, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ భీమిరెడ్డి, డైరెక్టర్ ఇమ్మానేయులు, వైస్ ఎంపీపీ నెహమియ్య, సర్పంచు మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- **గూడూరు:** ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో సోమవారం గూడూరు మండల కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కర్నూలులో ప్రారంభమైన ఈ ర్యాలీ ఆర్.ఖానాపురం మీదుగా గూడూరు చేరుకుంది. పట్టణంలో వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే పూల మాల వేసి నినాదాలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, జెడ్పీటీసీ మౌలాలి, చనుగొండ్ల మహేశ్వరరెడ్డి, జూలకల్లు కాంతారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆత్మగౌరవాన్ని కించపరుస్తారా?


నంద్యాల చెక్‌పోస్టు వద్ద బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య

- వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లా అధ్యక్షులు కాటసాని, రామయ్య
- చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బైక్ ర్యాలీ

కల్లూరు : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఖరీదైన ఇంటి స్థలాలను ఇస్తుంటే ఓర్వలేక వారి ఆత్మగౌరవాన్ని కించపరుస్తారా? అంటూ టీడీపీ అధినేత చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య మండిపడ్డారు. అమరావతి ప్రాంతంలో పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాలను సమాధులతో పోల్చిన చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కల్లూరు అర్బన్ నంద్యాల చెక్‌పోస్టు నుంచి బైక్ ర్యాలీ ప్రారంభించారు. సి.క్యాంపు సెంటర్, బిర్లాకాంపౌండ్, కృష్ణనగర్, చెన్నమ్మ సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. వారు మాట్లాడుతూ.. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పని చేశాని గొప్పగా చేప్పుకునే చంద్రబాబు నాయుడు పేదల ఇంటి స్థలాలను సమాధులతో పోల్చడం దారునమన్నారు. తన పాలన కాలంలో ఎన్నడైనా పేదలకు సెంటు స్థలం ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. అమరావతిలో ఇళ్ల పట్టాల ద్వారా చంద్రబాబు ఎవరి పక్షమో తేలిపోయిందన్నారు. సెంటూ స్థలం సమాధికి అయితే మరీ అంతకన్నా తక్కువ స్థలంలో చంద్రబాబు నిర్మించిన టిడ్కో ఇళ్లను ఏమనాలని ప్రశ్నించారు.

ఇచ్చిన హామీలను 98శాతం అమలు చేశాం

ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలలో 98శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. నవరత్నాల పేరుతో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. 2014లో చంద్రబాబు రైతుల రుణమాఫీ, పొదుపు సంఘాల రుణమాఫీ అని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేశారని, దీంతో పొదుపు సంఘాల సభ్యులు డీఫాల్టర్లుగా మారరని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రజలే చంద్రబాబుకు రాజకీయంగా సమాధి కడతారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శ్వేతారెడ్డి, అరుణ, శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, నారాయణరెడ్డి, నరసింహులు, వెంకటేశ్వర్లు, డీపీఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విడివిడిగా స్పందన.. అయోమయంలో ప్రజలు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో స్పందన కార్యక్రమాన్ని మండల అధికారులు విడివిడిగా తమ తమ కార్యాలయాల్లో నిర్వహించడంతో మండల ప్రజలు అర్జీ ఎక్కడ ఇవ్వాలో తెలియక అయోమయానకి గురయ్యారు. స్పందన కార్యక్రమాన్ని అధికారులు గతంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే వారు. అయితే వీడియో కాన్ఫరెన్స్ సెట్ తరచూ సాంకేతిక సమస్యలు వస్తుండటం, అదేవిధంగా ఉన్నతాధికారులు అదేశాలు మాటలు స్పష్టంగా ఉండక పోవడంతో తహసీల్దార్ శివశంకర్‌నాయక్, ఎంపీడీఓ రాముడు, ఇతర అధికారులు కార్యక్రమాన్ని ప్రతి వారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ మేరకు గత వారం మండల పరిషత్ కార్యాలయంలో స్పందనను నిర్వహించారు. అయితే సోమవారం ఎంపీడీఓ రాముడు కొంతమంది అధికారులతో కలిసి మండల పరిషత్ కార్యాలయంలో స్పందన నిర్వహించగా, తహసీల్దార్ శివశంకర్‌నాయక్ సెలవులో ఉండటంతో డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) సరళ, కొంత మంది అధికారులు, వీఆర్వోలు తహసీల్దార్ కార్యాలయంలోనే స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజలను అయోమయంలో పడేశారు. దీనితో ఎక్కడ అర్జీలు సమర్పించాలో తెలియక, అధికారులందరూ అందుబాటులో లేక ప్రజలు అవస్థలు పద్దారు.


తహసీల్దార్ కార్యాలయంలో స్పందన నిర్వహిస్తున్న డీటీ సరళ

అర్హుల జాబితా సిద్ధం

ఓర్వకల్లు: రైతు భరోసా పథకానికి అర్హులైన రైతుల జాబితాను సిద్ధం చేసినట్లు మండల వ్యవసాయాధికారి సుధాకర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 9,835 మంది రైతులను అర్హులుగా గుర్తించామన్నారు.

పనులు కల్పిస్తాం

కల్లూరు: అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు మండలం నెరవాడ గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఎండల తీవ్రత అధికంగా ఉందని, ఉదయం 6 గంటలకు పనికి వచ్చి త్వరగా ఇంటికి వెళ్లాలని కూలీలకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పని చేస్తే పూర్తి వేతనం పొందవచ్చన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

కర్నూలు (న్యూటౌన్): ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పించి, రూ.600 వేతనం ఇవ్వాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరాముడు అన్నారు. సోమవారం కర్నూలు మండలం గొందిపర్ల గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో సమావేశం నిర్వహించారు. వ్యవసాయకార్మిక సంఘం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా చెన్నమ్మ, తిరుపతిరాజు, ఉపాధ్యక్షులుగా ఉమాదేవి, సహాయ కార్యదర్శిగా వెంకటరాముడు, కోశాధికారిగా మద్దమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పాత పెన్షన్ పునరుద్ధరించాలి

కర్నూలు(రూరల్): తపాలా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, పాత పెన్షన్ పునరుద్ధరించాలి అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళి డిమాండ్ చేశారు. నగరంలోని బీఏఎస్ కల్యాణ మడపంలో తపాలా శాఖ ఉద్యోగులు నిర్వహిస్తున్న రాష్ట్ర ద్వై వార్షిక మహాసభలు రెండో రోజు కొనసాగాయి. జనవిజ్ఞానవేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి, తపాలా శాఖ ఉద్యోగులు లక్ష్మీకాంత్, శమంతక రెడ్డి పాల్గొన్నారు.

మహానుభావులు చూపిన మార్గంలో నడవాలి

కల్లూరు : మహానుభావులు చూపిన మార్గంలో నడవాలని ప్రొఫెసర్ ఖాశీం, రిటైడ్ అడిషనల్ డీజీపీ కె.బాబురావు అన్నారు. సోమవారం మండలంలోని ఉలిందకొండ గ్రామంలో మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే, ఫాతిమా షేక్, బాబా సాహెబ్ అంబేడ్కర్‌ల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఎన్‌కే జయన్న అధ్యక్షతన నిర్వహించారు. పట్నం రాజేశ్వరి, నక్లమిట్ట శ్రీనివాసులు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఫాతిమా షేక్ పుస్తకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుంకులమ్మ, శేషఫణి, కొమ్ముపాలెం శ్రీనివాసులు, జెవి కృష్ణయ్య, అజీజ్, అన్వర్ హుస్సేన్ పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహాని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సంక్షిప్తం

ప్రశాంత జీవనం గడపండి

పాణ్యం: గ్రామంలో ఘర్షణలకు తావులేకుండా ప్రశాంత జీవనం గడపాలని పాణ్యం ఎస్ఐ సుధాకర్‌రెడ్డి అన్నారు. బలపనూరు గ్రామంలో సోమవారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ ప్రధాన కూడళ్లలో ప్రజలతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఘర్షణలకు తావు ఇవ్వకుండా గ్రామాల్లోనే సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. లేని పక్షంలో పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించి న్యాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మధుసూదన్ పాల్గొన్నారు.

విత్తనాలకు పేర్లు నమోదు చేసుకోండి

గూడూరు రూరల్ : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సబ్సిడీ వేరుశనగ విత్తనాలకోసం రైతులు ఆర్బీకేల్లో పేరు నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి శ్రీవర్ధన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేరుశనగ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, పేరు నమోదు చేసుకుంటే పంపిణీ చేస్తామన్నారు.

వేలంలో పెరిగిన ఆదాయం

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గాభోగేశ్వర క్షేత్రానికి చెందిన మాన్యం భూములకు నిర్వహించిన వేలం పాటలో గతేడాది కంటే ఈ ఏడాది ఆదాయం పెరిగినట్లు ఈఓ చంద్రశేఖరరెడ్డి, చైర్మన్ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో 58.21 ఎకరాలకు వేలం పాటలు నిర్వహించారు. గతేడాది రూ.8,05,000 వేలం పాటలు పాడగా ప్రస్తుతం రూ.12,09,700లకు రైతులు దక్కించుకున్నారు. దీంతో రూ.4.47 లక్షలు అదనపు ఆదాయం వచ్చినట్లని ఈఓ చెప్పారు. కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి గోపి, ధర్మకర్తలు పరమేశ్వరరెడ్డి, శివుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డుప్రమాదంలో వ్యక్తి మృతి

కర్నూలు: స్థానిక సోమిశెట్టి కాలనీలో నివాసముంటున్న రబ్బానీ (39) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈయన ప్లంబర్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి రైల్వే స్టేషన్ రోడ్డులో ద్విచక్ర వాహనంపై స్పీడ్‌బ్రేకర్‌ను చూసుకోకుండా వేగంగా వెళ్లడంతో అదుపు తప్పి కింద పడటంతో తలకు గాయాలై మృతిచెందడంతో రెండో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించి సోమవారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

పేళ్ల మందు తాగి మహిళ మృతి..

బంగారుపేటలో నివాసముంటున్న మహేష్ భార్య కమల(22) పేళ్ల మందు తాగి అపస్మారక స్థితిలో చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతిచెందింది. ఆమె మేనకోడలు రత్న తలలో పేళ్లు ఉండటంతో శనివారం రాత్రి పేళ్ల మందు తెచ్చుకుని గ్లాసులో పోసుకుని తలకు అంటించుకునేందుకు కిటికీలో పెట్టుకుంది. రత్న బయటకు వెళ్లి వచ్చేలోగా చూసుకోకుండా అదే గ్లాసుతో కుండలోని నీళ్లు నింపుకుని కమల తాగడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేరిపించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందింది. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.